

# కులకాంత

**రామయ్యే** అంతటివాడూ మొండిపట్టు పడితే, సీతమ్మ తల్లి చేసేది లేక, మరో దిక్కు తోచక నిలువునా నిప్పులోకి దూకిందా! నిక్కచ్చిగా, మేలిమి బంగారంగా బయటకు వచ్చిందా! ఇంత రభస జరిగిన తర్వాత గత్యంతరంలేక, ఆలిని చేబట్టి అయోధ్యకు తరలివెళ్ళాడు. సత్యకాలపు రోజులు కాబట్టి, సాక్షాత్తూ అవతార పురుషుడు కాబట్టి అంత యజ్ఞం చేశాడు. ఈ రోజుల్లో ఇలాంటి పరిస్థితులే తారసిల్లితే—

ఈ రోజుల్లో అంటే—

ఇరవై సంవత్సరాలక్రితం, తన్ను తాను మరాపి రోజుల్లో; దానం, ధర్మం అడుగంటని రోజుల్లో—ఆనాటి సంగతి—

"రామయ్య" అని పేరు పెట్టుకున్నందుకు ఆ అయ్య బుద్ధులే వచ్చినాయి. అయ్య కమతం చేస్తూ చేస్తూ కన్ను మూశాడు. అమ్మ చిన్నప్పుడే, అయ్యకన్నా ముందే వెళ్ళింది. మరో మార్గంలేక అయ్య వదిలిన కమతం ఒప్పుకున్నాడు.

అనాటినుంచీ పెద్ద కాపు దగ్గరే ఉన్నాడు. పొద్దు పొడవకముందు పనిలోకి వెడితే, చీకటి పడిన తర్వాత ఇంటికి వచ్చేవాడు. పగలంతా బండ చాకిరీ చేస్తాడయ్యా. పోనీ! ఇంటికి వచ్చిన తర్వాత ఉడుకు నీళ్ళు, వేడిబువ్వ, వేప చెట్టు క్రింద నులక మంచం వేసుకుని కునుకుతీస్తే— తప్పొదియ్యా, అదో మజా! నోచుకోవద్దూ? వండి వార్చేవారు ఉండద్దూ! చన్నీళ్ళు, చద్ది బువ్వ అలవాటయింది. చలికాలంలో కూడా ఇదే బ్రతుకయితే చస్తే మేలు కాదు.

కోటయ్య మామ ఉన్నాడు. అయ్య పోయే టప్పుడు ఆయన చేతుల్లో పెట్టి వెళ్ళాడు. కబుర్లు చెప్పడమేతప్ప వండగవాడన్నా పిలిచి కూడు పెట్టడు కదా! పెరిగిన పిల్ల ఉంది. పిలిచి పిల్ల నివ్వకూడదూ? ఉహుఁ అసలు పెండ్లే వద్దు. ఉన్న బ్రతు కేదో ఒంటరిగానే బ్రతుకుతే వంశానికి చేటు వస్తుందా? అయ్య నరకానికి వెడతాడా?

ఓపొద్దున వేపచెట్టుక్రింద నులక మంచం మీద కూర్చుని బీడీ కాలుస్తున్నాడు. కోటయ్య మామ వచ్చాడు.

"రామయ్యా, ఎన్నాళ్ళురా ఈ ఒంటరి బ్రతుకు? పెద్ద కాపుదగ్గర కమతం—బ్రతుకు వెళ్ళిపోతుంది. పెళ్ళి చేసుకోకూడదూ?!"

"వద్దు లేవయ్యా."

"ఏం?"

"నీకు తెలియం దేముంది, మామా? తాళి కట్టాలంటే రూకలుండాలా? ఆ తర్వాత బువ్వకు నూకలుండాలా? రెండూ లేవుగా!"

"కామందు నడిగి చూడకపోయావు?"

"కాదంటే?"

"అప్పుగానేగా?"

"అయ్యచేసిన అప్పు ఇంకా పూర్తిగా తీర లేదు. కమతంలో సగం మినహాయించుకుంటు న్నాడు."

"సరే లేవయ్యా. ఒకసారి కదలేసి చూడు. కాదంటే, ఉన్న కుంటా తాకట్టు పెట్టు. నెమ్మ దిగా విడిపించుకోవచ్చు."

"నువ్వే వ్రాయించుకో. రెండు నూరులుంటే పడెయ్యి."

"నా దగ్గరా! రెండు రూపాయలు కూడా లేవురా."

"పోనీ, పిల్ల నివ్వు."

"ఛా! వెధవా! నీకా!"

"ఛీ, ఫో. వేపచెట్టు గాలి అంతా తింటు న్నావు! నీ సంగతి నాకు తెలుసులే, మామా. ఇదుగో, నా పెళ్ళి సంగతి తిరిగి ఎత్తావంటేనా— బుర్ర రామకీర్తన పాడిస్తా!"

కోటయ్య తన గుడిసెవైపు ఒక్క ఉరుకు ఉరికాడు.

"వాయాల! ఈడి కూతురికి నేను పనికి రానంట. అసలు అది కూతురే నాకు వద్దు. ఓ మామా! వేపచెట్టుక్రింద కూర్చుని చెబుతున్నా. ఇదుగో, ఏరువాక లోపల నీ కూతురికి తలదన్నే

**కాలంతోపాటు విలువలుకూడా మారుతూ ఉంటాయి. అలా అని మనిషి నైజంలో సృష్ట్యాదినుంచి నేటివరకు పెద్ద మార్పు వచ్చిన సూచనలు ఏమీ కాన రావడంలేదు. నానాటికి మార్పు చెందుతూవచ్చే విలువలకన్న పాత కాలపు విలువలకే అనంతమైన ప్రభావం ఉండడానికి ప్రాయశః అదే కారణం అయిఉంటుంది.**

దాన్ని తెస్తా. కుంట పొలం రాసేస్తా. గుడిసెలో దీపం వెలిగిస్తా. రామయ్య మాటంటే తెలు సుగా—ఆనాటి రామయ్య మాటతో సరి! ఆ!"

కోటయ్య తిరిగి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"కుంట పొలం వ్రాస్తావా?"

"ఓ!"

"పిల్లనిస్తా."

"కుంటకు పెళ్ళి చేస్తావా?"

"ఛా! నీకు....."

"కరణం దగ్గర కమతం చేస్తున్నందుకు, ఆడి బుద్ధులే నీకూ వచ్చాయి, మామా! ఆడూ అంతే. కాసు కనపడితే చాలు—తప్పుడు కాగితాలు కుప్పలుగా రాసేస్తాడు. ఇదుగో, మామా, నీ కూతురి కైతే కాసు ఇవ్వను."

"ఏం?"

"చిన్నప్పుడు అదీ.....నేనూ....కలిసిమెలిసి తిరిగిన వాళ్ళమేగా! నీ సంగతి నాకు ఎరికేలే, మామా! కుంట వ్రాయించుకుని పిల్లను ఇంట్లో పెట్టుకుంటావు. నన్ను తరిమేస్తావు."

"ఎంత మాట!"

"ఉన్న మాటయ్యా. పెద్ద అల్లుడు గతి ఏమయింది? ఉన్నది వ్రాయించుకున్నావు. ఊళ్ళోంచి వెళ్ళకొట్టావు. కూతురిని కూలీకి తోలడమేతప్ప కాపురం చేయించావ్! తప్పొదియ్యా! నిన్ను నరకాలి, మామా!"

"ఎంత మాట్లంటున్నావ్! నరకానికి పోతావ్!"

"నా పేరేమిటో తెలుసా? రామయ్య. నీతికి, నిజాయితీకి నిలబడతాను. నేను నరకానికి పోను. నువ్వూ, కరణం చివరికి అక్కడికే పోతారు. మామా! నన్ను రెట్టించకు. వేపచెట్టు గాలంతా వృధాగా పోతోంది. నన్ను కునుకు తియ్యనీ."

కోటయ్య మెల్లగా జారుకున్నాడు.

మరునాడు కోడి కూసింది. పెద్దకాపు దగ్గరకు వెళ్ళాడు. మనసులో ఉన్నది మర్మం లేకుండా బయటపెట్టాడు. రెండు నూరుల రూకలు ఇస్తే మూట కట్టుకున్నాడు. ఇంటికి చేరుకున్నాడు. అమ్మను, అయ్యను తలుచు కున్నాడు. వేపచెట్టుకు మొక్కాడు. కోటయ్య గుడిసెవంక చూసి మీసం తిప్పాడు. కాలవగట్టు పుచ్చుకున్నాడు. ఊరు దాటాడు. ఏరు దాటాడు.

ఏటి అవతల, తాటాకుల గుడిసెలో ఏరుకున్న దానికి తాళి కట్టాడు. మంచి రోజు చూసు కుని తరలించుకు వచ్చాడు.

## తల్లావఝల సరోజిని

వస్తూ—

"పిల్లా!"

"ఊఁ"

"కూడు వండగలవా?"

"ఊఁ"

"ఉడుకు నీళ్ళు పోస్తూ వీపు రుద్దుతావా?"

"ఓ!"

"చాల్లే! ఇంతకన్నా సంబరా లొద్దులే."

"......."

"కమ్మ వ్రాయగలవా?"

"ఉహూఁ"

"పోనీలే. అయినా కలిసి మెలిసి ఉండే వాళ్ళకు కమ్మ లెందుకు? కాగితా లెందుకు? మా కామందు అల్లుడు ఎప్పుడూ పట్నంలోనే ఉంటాడు. పండక్కీ, పబ్బానికి వస్తాడు. మిగతా రోజుల్లో కమ్మలంటే కాపురం చేస్తాడు. ఏం సంపారాలో....." ఇకిలించాడు. చిన్నది సిగ్గు పడింది.

"కూలీకి వెడతావా?"

"పంపుతావా?"

"ఆహా! అక్కరవస్తే...."

"నీ ఇష్టం...."

"నారు పొయ్యడం?"

"వచ్చు."

"ఊడుపు?"

"వేస్తా."

"చాల్లే. ఇంక చెప్పొద్దులే. సరిపోయావు నాకు. ఆట్లా ఉండాలి ఆడదంటే, సాయిలా పాయిలాగా. కూడుకు లోటు లేదే, పిల్లా. కుంట పొలం వుంది. బ్రతికుండగా నిన్ను కూలీకి తోలుతానా! ఎంగిలి పాటలు పాడనిస్తానా! ఛీ! ఊరికే అడిగా. అంతే."

వేపచెట్టు చుట్టూ కొంగు పుచ్చుకుని మూడు సారులు తిరిగాడు. దండం పెట్టాడు. ఈతా కుల గుడిసె తలుపుదగ్గర నిలబడ్డాడు.

"అమ్మీ! అమ్మ, నాన్న మాట అనుకోకుండా ఇక్కడ కాపురం చేశారు. కన్ను మూశారు. వాళ్ళ చలువే. ఊఁ దీపం పెట్టు....."

ఉడుకు నీళ్ళు, వేడిబువ్వ—అబ్బ! రామయ్యకు ఎంత ఉబలాటం! ముచ్చటగా మూడు నెలలు గడిచాయి. తరువాత ముంచు కొచ్చిందయ్యా.

ఏమయింది?

ఆగవయ్యా. గుర్తుకు తెచ్చుకోనీ. నిన్న మొన్నటి సంగతి కాదుగా?

ఏమయిందా? అనరానిది అయింది. ఓ పొద్దు ఏరుదాటి బావ వచ్చాడు. బాధ చెప్పుకున్నాడు. వెంట తోలుకువెళ్ళాడు.

మలుపుకాడ కోటయ్య కనుపిస్తే, రామయ్యకు కబు రందచేయమంది. ఏమని?

"అయ్యా, అక్క మంచాన పడ్డదట. పిల్లా, జెల్లా— సాకేవాళ్ళు లేరు. సాయం వేడుతున్నా. ఈ ముక్క ఆది చెవినెయ్యి. వస్తా...."

వస్తానన్నది తిరిగి రాలేదు.

"సీతా! మనసంతా నీమీదే. మనుగడ కష్టంగా ఉంది. పున్నమి లోపలరా. మరువద్దు..."

కమ్మ వ్రాయించాడయ్యా. ఉహూఁ రాలేదు. కబురు పెట్టలేదు. రాలేదని చింత తప్ప, సీతమ్మ ఏటి అవతల ఏ కష్టాల్లో ఉందో రామయ్య కేం తెలుసు?

కమ్మ అందిందో, లేదో? పోనీ, పెద్దవాడు కోటయ్య మామను పంపుతే మందలించి వెంట తెస్తాడేమో? తప్పాదియ్యా! అద్ది నమ్మడానికే వీల్లేదు. కుంట పొలం ఇచ్చి కూతురిని కట్టుకో లేదని అక్కసు మీదున్నాడు. రెండు మూడు కలిపి చెప్పి అసలు కాపురానికే ముప్పు తెస్తే? పోనీ, మరో వెంకన్నను వేడుకుంటే? ఏరు వరదలో ఉంది. ఎట్లా దాటుతాడు? అదేం కర్మమో! అన్నీ అట్లా ఒనగూడినాయి. తాళి కట్టకుండానే ఉంటే బాగుండేది. లేకపోతే, అప్పుడు, ఇప్పుడు ఒకటేగా? ఒంటరి బ్రతుకేగా? పైగా తలెత్తుకు తిరిగే దెట్లా!

ఎవడన్నా నిలేసి, "కోడలు కనుపించదేరా?" అంటే ఇంక పరువెక్కడిది?

"లేచిపోయిందేరా" అంటే తల నరుక్కోవలసిందేగా? తప్పాదియ్యా! ఎంత తంటాలు తెచ్చిపెట్టింది!

"ఏరా, రామయ్యా! మరి బక్కచిక్కావు. కోడలు కూడు పెట్టటంలా" అన్నాడు పెద్ద కాపు.

"ఊరెళ్ళింది, బాబూ!"

"ఏం? ఎన్నాళ్ళయిందిరా?"

"బాబొచ్చి తోలుకెళ్ళాడు. 'నాలుగు మాసాలయింది'."

"తిరిగి తోలుకు రాలేకపోయావ్?"

"నేనా! జీవుడుండగా ఆ పని చెయ్యను. మొగుడు కావాలంటే వస్తుంది. లేదంటే బావ దగ్గరే కులుకుతుంది. అయినా నాలుగు నెలలయింది. అంటే ఎనిమిది పక్షాలు. ఇక దాన్ని వెలి యేసినట్టే. ఇక ఏలను."

"ఏ మొహం! అవన్నీ పెట్టుకోమోకురా. కసిరి తీసుకురావాలి...."

"వద్దు బాబూ. మా అయ్య ఏం చెప్పాడో తెలుసా? ఆడది, పుట్టినింట, అత్త యింట తప్ప మరో ఇంట ఎనిమిది పక్షాలు ఉంటే తగిలి తరిమెయ్యాలిరా; అది తరం నిలపడానికి పనికిరాదురా అన్నాడు. పోయిందేదో పోయింది. దాని ఊసు ఇక వద్దులే, బాబూ...." అంటూ తల వంచుకుని పనిలోకి వెళ్ళాడు.

తిరిగి వస్తుంటే అవధాన్లుగారు కనుపించాడు. వాకబు చేశాడు.

"ఈ రోజుల్లో తప్పు లేదురా. తిరిగి తెచ్చుకోరా" అన్నాడు. అవధాన్లుగారంటే అయ్యకు గుడ్డి నమ్మకం. కాని అయ్య చెప్పిన మాట కాదని అవధాన్ల మాట వింటాడా?

"అయ్యా, ధర్మం అన్ని రోజుల్లోనూ ఒకటే. రోజులు మారితే ధర్మం మారుతుందా?"

"అంతేరా. మారాలి. నయానా భయానా నచ్చజెప్పి తోడి తెచ్చుకోరా."

"సరే, బాబయ్యా."

'కామందు చెప్పాడు. బాపనయ్య చెప్పాడు. కాదంటే బాగుంటుందా? కబురుపెట్టి చూద్దాం.' గోపయ్యను వేడుకున్నాడు. వెడతానన్నాడు. ఊరు పేరు చెప్పాడు. ఉండే చోటు చెప్పాడు. దారి బత్తానికి రెండు రూపాయలు రొంటిని కట్టాడు.

"అన్నా, రెండే ముక్కలు చెప్పు. మగడు కావాలనుకుంటే వెంటనే మగుడి రమ్మను. అంతే. ఇక ఉరుకు. మూడు పొద్దుల్లో తిరిగి రావాలి" అన్నాడు.

హనుమంతుడిలాగా గోపయ్య అన్నవేళకు వచ్చాడు.

"మాట చెప్పకుండా వచ్చాను. మదిలో ఏమను కున్నాదో ఏమో? ఇక్కడ ఇరుక్కుపోయినా. కమ్మ వ్రాయడం రాదు. వ్రాయిద్దామంటే సిగ్గు ముంచుకొచ్చిందయ్యా! ఈ తప్పు కాయమను—అంది. క్షేమ మడిగింది. చల్లగా ఉన్నాడన్నా. అయితే చాలంది. అక్క వచ్చింది. చెప్పిందిగందా—అయ్యా, మరిదికి దగరవాడ వనుకుంటాను. దాచకుండా చెబుతున్నా. చెల్లి నాన్నను ఎత్తుకోతోంది. ఏదో నెల. అమ్మ, నాన్న చిన్నప్పుడే పోయారు. నేనే సాకాను. చెంబుడు నీళ్ళు పోసి పంపుతాను. నా మాటగా మనవి చేయవయ్యా అంది."

పూస గుచ్చినట్టు పొల్లుపోకుండా చెప్పాడు.

విన్న పాలాన విస్తుపోయాడు. విరిగి నేల కూలాడు.

"అన్నా, బయటకు పొక్కనివ్వకు. పరువు పోతుంది." చేతులు పుచ్చుకున్నాడు. గోపయ్య వెళ్ళిపోయాడు.

'నాయాల! ఆడే పుణ్యం కట్టుకున్నాడు. కులం చెరిపాడు. కనుపిస్తే బాగుండు. కత్తి తీసుకు నరుకుతాను.'

ఏరుదాటి వెళ్ళి, ఏతా, వాతా తేలుస్తే—ఛీ! పరువానికి వేటు కాదూ? రామయ్య కాబట్టి, సముద్రాలు దాటి సాహసం చూపి, వెతికి తెచ్చుకున్నాడు. అసలు ఆడదానికి కాపురం చెయ్యాలని ఉంటే అసాధ్యం ఉందా? కనీసం అమావాస్య నాడన్నా చిమ్మ చీకటిలో రెక్కలు కట్టుకుని





శుభవార్త

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును.

మధుమేహము, రక్తపు పోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ. సంతానము లేనివారు గూడ శ్రీ యోగి గారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్సవల దేహములో వున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు ఒక రూపాయి పంపవలయును.

శ్రీ యోగాశ్రమము,
పి. ఓ. పెదవాల్తేరు, విశాఖపట్టణము

## పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాలుక పోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్ళిపడువారు పైపూతగా వాడినచో వ్రేళ్ళతో సహా మాయంచేయగల సంజీవి వెల పోస్టు ఖర్చులతో రు. 5—50 న. పై.

కొక్కోకము చిత్రపటములుగలది రు. 1—50

తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4—50

తెలుగు అంగ శాస్త్రబోధిని రు. 5—00

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో

8, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1

అన్ని వేళలయందు అందరూ

ఎంబ్రోసియా వారి

పళ్ళరస పానీయములు



1. డ్రింకాల్ (ద్రాక్ష, నిమ్మ, టొమాటో అనాస, ఆపిల్ పళ్ళరసములు కలది)
2. ద్రాక్షరసం
3. నిమ్మరసం
4. అనాసరసం
5. మామిడిపళ్ళ రసం
6. నారింజపళ్ళ రసం

సిరప్‌లు

1. ద్రాక్ష 2. ఆరంజ్ 3. రోజ్ 4. అనాస 5. రాస్‌బెర్రి 6. సరస్‌పరిల్లా (సుగంధి)

వాడండి!

అన్నిటికి మంచివి; అందరికి మంచివి

తయారుచేయువారు.

ఎంబ్రోసియా

క్యానింగ్ ఎంటర్‌ప్రైసెస్.

పోష్టుబాక్సు నెం. 543 :: విజయవాడ :: 3

సోల్ డిస్ట్రిబ్యూటర్లు :

ఎ. ఎల్. సౌత్ ఇండియా ట్రేడింగ్ కంపెనీ,

జె.బి.మంగారాం కంపెనీకి డిస్ట్రిబ్యూటర్లు

శివాలయం వీధి, విజయవాడ—1.

SUVARNA


# కులకాంత

ఏరు దాటదూ? సముద్రాలు ఈదదూ? చిటికలో ప్రక్కన వాలదూ! వద్దనుకుంది. ఉండిపోయింది. అంతే.

ఓపొద్దు బావను వెంటపెట్టుకుని బిడ్డను చంక నెత్తుకుని ఇంటికి వచ్చింది సీతమ్మ. ముగ్గు వేసి దీపం పెట్టింది. మగనికోసం ఎదురు చూస్తూ కూర్చుంది. రాలేదు. అట్లాగే కునుకు పట్టింది. కోడి కూసేసరికి వచ్చాడయ్యా. వచ్చినవాడు నిలువునా మండిపోయాడు.

''గుడిసెలో అడు గెందుకెట్టావ్?''

''మెట్టిన యిల్లు. నాదేకదయ్యా?''

''కాదని వెళ్ళావుగా?''

''కలలో కూడా అనుకోలేదయ్యా. కాలం అట్లా తెచ్చింది.'' కన్నీళ్ళు నింపింది.

''కమ్మ వ్రాశానుగా?''

''అందలేదయ్యా.''

''అదంతా నా కెందుకులే. నీతప్పు కప్పుతాను. నిన్ను వదిలేశాను. మరో దిక్కు చూచుకో.''

''అదేం మాటయ్యా! నా తప్పు మనవి చెయ్యనయ్యా.''

''వద్దులే. రలుచుకుంటే మరీ బాధ. నే పోతున్నా.''

సీతమ్మ నిలవలేకపోయింది. తాచులాగా లేచింది. వెళ్ళేవాడ్ని వడేసి పట్టింది. నిలేసింది.

''నీ మనసులో మర్మం చెప్పు. సత్యం ఎరుకపరుస్తా....'' సీతమ్మ వాపోయింది. బావ నిద్ర లేచాడు. అంతా ఆకళింపు చేసుకున్నాడు. బయటకు వచ్చాడు.

''సీతమ్మనం టేపాపమయ్యా. చిన్నప్పటినుంచి సాకాను. నా కూతురు లాంటిది'' అన్నాడు బావ.

''నరుకుతాను. నాయాల! దానితో కులికింది చాలక, కులం చెరిపింది చాలక పైగా కూతురంటున్నావు. నాలిక తెగ్గోస్తాను.'' బావమీదకు ఉరికాడు. సీతమ్మ బావను ఆదుకుంది.

''బావా! నువ్వు గుడిసెలోకి వెళ్ళు. నావాడిని నేను మలుపుకుంటాను'' అంది. మగనివంక చూచి ఇక చెప్పిందయ్యా.

''నీ బిడ్డడు కాదంటావా!''

''ముమ్మాటికీ అడి పుణ్యమే.''

''రూపు నీది కాదంటావా?''

''నేను కన్నెత్తి సూడలేదుగా!''

''చూడకూడదూ?''

''ఛీ పాపం!''

''పోనీ.....ఈ వేపచెట్టుక్రింద ప్రమాణం చెయ్యమంటావా?''

''అమ్మ అయ్య పచ్చగా బ్రతికినచోటు. చేటు తేవడం దేనికి?''

''పోనీ. పచ్చటి పైరుమీద పమిట పరిచి ప్రమాణం చేస్తా!''

''పంట నాశనమవుతుంది.''

''నీ కాళ్ళు ముట్టుకు చెబుతా!''

''నేను బ్రతకాలని లేదా?''

''మరి నాకు దారి చెప్పు. నా సత్యం నిలబెట్టుకుంటా'' అని ఎంతగానో వాపోయిందయ్యా సీతమ్మ తల్లి. రామయ్య వినలేదు.

''సత్తెంగా మనవి చేస్తున్నానయ్యా. ఈ మేనుమీద మరో చెయ్యి పడలేదయ్యా. నీ రక్తం పంచుకు పుట్టాడయ్యా బిడ్డడు. నీవే నాకు దైవం. మరొకడి ఊసు నా మనస్సులో తలచలేదయ్యా.''

''మరి, ఆ యమ్మ సీతమ్మలాగా నిప్పులోకి దూకుతావా?''

''కానీ! నీ మాట కాదంటానా!''

బావ లోపలనుంచి ఏడుస్తూ బయటికి వచ్చాడు.

''అమ్మా, సీతమ్మా! ఏం పనమ్మా ఇది! వద్దు, వద్దు.''

''నా సత్తెం నాతోనే వుంది. నిక్కచ్చిగా బయటికి వస్తా. నువ్వు గుడిసెలోకి వెళ్ళు, బావా. బిడ్డను సాకుతూవుండు. ఊఁ కానీ యయ్యా! కట్టెలు కాలెయ్యి'' అంది. సీతమ్మ వేయి దివిటీల వెలుగు వెలిగింది. నిబ్బరంగా నిలబడింది.

రామయ్య పలకడుగందా! కొయ్యలాగా నిలబడిపోయాడు. కామందు కాలవ గట్టుమీద నుంచి వస్తున్నాడు. కోడలినిచూచి ఆగిపోయాడు. గుడిసె దగ్గరకు వచ్చాడు. బావ చెప్పగా అంతా ఆకళింపు చేసుకున్నాడు. గుడిసెలోకి వెళ్ళి మనుమడ్ని ఎత్తుకున్నాడు.

''సమయానికే వచ్చాను. లేకపోతే సీతమ్మ బుగ్గి అయిపోయేది. ఒరే, రామయ్యా! ఏం పనిరా! ఆ రోజులు కాబట్టి ఆ యమ్మ బయటకు వచ్చింది. ఈ రోజుల్లో నిప్పులోకి దూకితే అందరూ చస్తారు. ప్రతి రోజూ జపంచేసే అవధాని కూడా మండిపోతాడు. తప్పాదియ్యా! ఎంత హంగామా చేశావు! కొడుకుని కన్నెత్తి చూశావా? చూడు, ఈ ముక్కు, బుగ్గలు చిన్న కళ్ళు—అంతా నీ పోలికే. అరేయ్! ఇకనుంచి నా కోడలితో కజ్జా లాడావంటే కుమ్తం ఊడపీకుతా, జాగ్రత్త!'' అన్నాడు కామందు.

''నా పోలికే నంటారా?''

''ఓ తప్పకుండాను! చూస్తావేరా? చంక నేసుకో!'' పిల్లాడ్ని అందిచ్చాడు.

రామయ్య బిడ్డ నందుకున్నాడు. ఎగాదిగా చూశాడు. సంబరపడ్డాడు. చంక నెత్తుకున్నాడు.

''సరిపోయావే, పిల్లా! నేను ఎంత నిక్కచ్చే నువ్వూ అంతే. ఏదో కోపంమీద దూకమన్నాననుకో. దూకుతావంటావా? నువ్వు లేకపోతే నే నేమైపోతాను? సరే, పదు. వస్తాను, బాబయ్యా'' అంటూ సీతమ్మను వెంటబెట్టుకుని గుడిసెవైపు నడిచాడు. ★